మందుగుండు సామాగ్రి స్థలాన్ని సీఐ పరిశీలన

విశాలాంధ్ర-రణస్థలం : దీపావళి సందర్భంగా రణస్థలం మండలంలో 7 క్రాకర్స్ షాపులకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ షాపులను రణస్థలం మండలం జేఆర్ పురం సీఐ ఆదాం శనివారం పరిశీలించారు. అనంతరం షాపు నిర్వాహికులకు పలు సూచలను సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపు దగ్గర నీటిని మరియు ఇసుకను ఎక్కువ మోతాదులో ఉంచాలని అన్నారు. నాన్-బ్రాండెడ్ లేదా తక్కువ-నాణ్యత కలిగిన క్రాకర్లలో ప్రమాదకర రసాయనాలు ఉంటాయని.. ఇవి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు అని అన్నారు. కావున బ్రాండెడ్ బాణసంచా కొనుగోలు చేయడం చాలా ముఖ్యమని ప్రభుత్వ సంస్థలచే నియంత్రించబడే లైసెన్స్ ఉన్న దుకాణాల నుండి ఎల్లప్పుడూ క్రాకర్లను కొనుగోలు చెయ్యాలని అన్నారు. నాణ్యత లేని ఫైర్ క్రాకర్‌లను కొనుగోలు చేయడం వల్ల మీ మరియు మీ కుటుంబ సభ్యుల భద్రతకు హాని కలుగుతుందని అన్నారు. అదేవిధంగా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ సిబ్బందికి మరియు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధన కేంద్రంను వైద్యులు సందర్శన

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభ పురం సమీపంలో 50కోట్ల రూపాయలతో నిర్మించిన 200 పడకల ఆసుపత్రితోపాటు కిడ్నీ పరిశోధన కేంద్రంను శనివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పలాస కాశీబుగ్గకు చెందిన వైద్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆసుపత్రిలో ఉన్న ప్రతి విభాగాన్ని వైద్యులకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్మోహనరెడ్డి ఉద్దాన కిడ్నీ రోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కరోనా సమయంలో రెండేళ్లు పనులు నిలిచిపోయినా ఆసుపత్రి పూర్తి చేసేందుకు అనేక ఇబ్బందులు వచ్చినా వాటిని ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. అనేక బాలరిష్టాలు అధిగమించి ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నానని తెలిపారు. జిల్లాలో వన్నె తెచ్చే విధంగా కిడ్నీ ఆసుపత్రి సేవలు రోగులకు ఉంటాయని తెలిపారు. ఆయన వెంట పలాస కాశీబుగ్గలకు చెందిన వైద్యులు మల్లేశ్వరరావు, రాజకుమార్, భీమారావు, బాలక్రిష్ణ, పొందల జగదీష్, క్రిష్ణమూర్తిలతో పాటు ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైసీపీ నాయకులు అంబటి ఆనందరావు, లక్ష్మణ్, కోణంకి శ్రీనివాసరావు, హనుమంతు రామ్మోహనదొర, అల్లు వెంకటరమణ, కొర్రాయి శ్రీకాంత్, క్రిష్ణలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరులో నిరాశాజనకంగా నిబంధనలు

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ప్రభుత్వం అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరులో అనేక నిరాశజనకంగా నిబంధనలు విధించడం పట్ల ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యదర్శి డి.మహారణ, పలాస కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జగదీష్, రాము, అశోక్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక మంది జర్నలిస్టులకు అక్రిడేషన్లు లేకపోయినా వివిధ పత్రికల్లో పని చేస్తున్నారని, వారికి కూడా ఇళ్ల స్థలాల మంజూరు చేయకుండా అక్రిడేషన్లు ఉన్న జర్నలిస్టులకు నిబంధనలు పెట్టి ప్రభుత్వం త్రిశంఖు స్వర్గం చూపిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జర్నలిస్టు కుటుంబంలో ఎవరైనా ఉద్యోగం చేస్తే వారికి స్థలం ఇవ్వరాదని నిబంధన విధించడ సమంజసం కాదన్నారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా ఇళ్ల స్థలం లేదా ఇళు పొందిన జర్నలిస్టులకు తాజాగా ప్రభుత్వ విడుదల చేసిన జీవో ప్రకారం స్థలం మంజూరు చేయరాదని నిర్ణయించడం కూడా అన్యాయమన్నారు. మూడు సెంట్ల స్థలం విలువలో ప్రభుత్వం 60శాతం, మిగిలిన 40శాతం డబ్బులు జర్నలిస్టులు చెల్లించాలని పేర్కొనడం, ఆ స్థలంలో పదేళ్లల్లో ఇళ్లు నిర్మించకపోతే స్వాధీనం చేసుకుంటామనడం కూడా దారుణమన్నారు. ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆందోళనకరంగా ఉన్నారని, ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించాలని వారు డిమాండ్ చేశారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు అనూహ్య స్పందన

బీసీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు

విశాలాంధ్ర-నరసన్నపేట : జిల్లాలో సామాజిక సాధికార బస్సు యాత్రకు అనూహ్య స్పందన వస్తుందని, ఈనెల 15వ తేదీన నరసన్నపేట నియోజకవర్గంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్, డి.పి.దేవ్, కళింగ కోమట్ల కార్పొరేషన్ చైర్మన్, అంధవరపు సూరిబాబు, కాపు కార్పొరేషన్ చైర్మన్, మామిడి శ్రీకాంత్, పొందర, కళింగ కార్పొరేషన్ చైర్మన్, పేరాడ తిలక్, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్, రాజాపు హైమావతిలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొదటి విడతగా ఇఛ్ఛాపురంలో ప్రారంభమై పార్వతీపురంలో ముగిసిందన్నారు. రెండవ విడతగా ఈనెల 15వ తేదీన నరసన్నపేట నియోజకవర్గంలో ప్రారంభమవుతుందని, ఈ యాత్రకు నియోజకవర్గ ప్రజలంతా స్వచ్ఛందంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి వైసిపి పార్టీ మంత్రులు, రీజనల్ కోఆర్డినేటర్లు, ముఖ్య ప్రముఖులు హాజరవుతారని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఈ నాలుగున్నరేళ్ళ పాలనలో ప్రజానీకానికి అందచేసిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు గూర్చి వివరిస్తారని తెలిపారు. వెనుకబడిన సామాజిక కులాలకు కార్పొరేషన్లు పెట్టి, గౌరవం పెంచే విధంగా ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, ఆరంగి మురళీధర్, వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, తంగుడు జోగారావు, సురంగి నర్సింగరావు, కెసిహెచ్‌బి.గుప్తా, రాజాపు అప్పన్న, తంగుడు గిరిధరుడు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : రాజాం జి.సి.ఎస్.ర్ కళాశాలలో నిర్వహించిన కంపిష్టా అంతరాష్ట్ర పోటీలలో గురజాడ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈనెల 10వ తేదీన రాజాం జి.సి.ఎస్.ర్ కళాశాలలో నిర్వహించిన కంపిష్టా అంతరాష్ట్ర పోటీలలో గురజాడ విద్యా సంస్థలకు చెందిన గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాలలో మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థులు కిరణ్, పూజిత, ఆనంద్ ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామీనాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్ మెంట్ విభాగధిపతి వి. మహేష్, అధ్యాపకులు ఎన్. చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 10న శిష్టరకరణ సంఘం కార్తీక సమారాధన

విశాలాంధ్ర-పొందూరు : రానున్న డిసెంబరు 10న (ఆదివారం) పొందూరులోని మామిడితోటలో ప్రాంతీయ శిష్టకరణ సమాజం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన కార్యక్రమం జరిపేందుకు నిర్ణయించారు. శనివారం శిష్టరకరణ సంఘం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో సభ్యులంతా తీర్మానించారు. ఈ సమావేశానికి ప్రధాన కార్యదర్శి వాండ్రంగి దామోదరరావు అధ్యక్షత వహించారు. వివిధ క్రీడలను నిర్వహించేందుకు పి.దివాకర్ పాత్రో, బి.ఈశ్వరరావు, బలివాడ కిషోర్ శివ,బి.సత్యన్నారాయణ, వాండ్రంగి నిరంజన్, వి.ఉమామహేశ్వరి, ఉరిటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గౌరవాధ్యక్షులు వి.కృష్ణదాసు, కార్యదర్శి కుప్పిలి శ్రీనివాసరావు ఆధ్వర్యం వహించారు.

వసప వంశధార నదీతీరాన గుర్తు తెలియని శవం లభ్యం

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం వసప వంశధార నదీ తీరాన ఒక గుర్తు తెలియని శవం లభ్యమైంది.స్థానిక విఆర్వో గిరీష్ కుమార్ పట్నాయుక్ కొత్తూరు పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశారు ఏస్.ఐ అహ్మద్ సిబ్బంది వెళ్లి శవాన్ని పరిశీలించారు నీలం రంగు లుంగీ , నీలం రంగు షర్ట్ ధరించి యున్న పురుషుని శవం అని ఎస్ ఐ తెలిపారు .మృతిని ఏడమ చెయ్య పై నంబ లతిక అనే పేరు ఉంది. ఫ్లస్ అనే గుర్తు ఉంది ఈ వ్యక్తికి సంబంధించి సమాచారం తెలిసినవారు కొత్తూరు పోలీస్ స్టేషను 6309990882 సబ్ ఇన్స్పెక్టర్ 6309990828 సీఐకు ఫోన్ ద్వారా గాని నేరుగా గానీ తెలియచేయొచ్చు అని ఎస్.ఐ అహమ్మద్ మీడియాకు తెలిపారు.

ఉత్తరాంధ్రను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

పౌరహక్కుల సంఘ నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్

విశాలాంధ్ర-పలాస : ఉత్తరాంధ్ర జిల్లా లను కరువు జిల్లాలుగా ప్రకటించాలని శ్రీకాకుళం జిల్లా పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఇచ్ఛాపురం నుండి వజ్రపుకొత్తూరు మండలం వరకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. సోంపేట కంచిలి మండలాల్లో వర్షాలు పూర్తిగా లేక కొన్ని ప్రాంతాల్లో విత్తనాలే పూర్తిగా వేయలేదని, కొన్ని ప్రాంతాలలో విత్తనాలు వేసినప్పటికీ కూడా దమ్ము పెట్టి వరి నాట్లు వేయలేదని తెలిపారు. మందస పలాస మండలాలలో వారి నాటిన తర్వాత కూడా వర్షాలు లేక పొట్టతో ఎండిపోయినటువంటి పరిస్థితి కళ్ళారా చూశామని, చుట్టుపక్కల ఉన్న చెరువులు కాలువలు గుంటలలో ఉన్న నీరుని పంపు సెట్లు అద్దెకు తీసుకొని డబ్బులు ఖర్చు పెట్టినా ఇంత వరకు వర్షాలు లేకపోవడంతో పూర్తిగా వరి పంట విధ్వంసం అయిపోయిందని అన్నారు. రైతులతో మాట్లాడుతున్న సందర్భంలో వాళ్ల కుటుంబ శ్రమ పెట్టుబడి వాళ్ళ బ్రతుకంతా ఎడారిగా మారిపోయిందని కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారన్నారు. రబీ పంటకు ఎలా తాము సిద్ధపడాలని ఈ ఏడాదంతా ఎలా బ్రతకాలని అనేక ప్రశ్నలు సంధిస్తున్నారని రైతుల ఆవేదన బాధ చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితి ఉత్తరాంధ్ర వ్యాపితంగా ఉన్నదని అనేక జీవ నదులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వాలు విఫ్రమైనాయని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం మొదలుకొని నాగావళి వరకు సాగునీరు పుష్కలంగా ఉన్న రైతు పండించే పంటకు నీరు అందటం లేదని, ఈ పరిస్థితులకు ఎవరు కారకులని, ప్రభుత్వాల నిర్లక్ష్యం కాదా అని పౌర హక్కుల సంఘం సభ్యులు ప్రశ్నించారు. తక్షణమే యుద్ధ ప్రాతిపదికన రైతులను రైతు కూలీలను వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, ప్రతి ఎకరానికి 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని ప్రత్యామ్నాయ పంటల కోసం శాస్త్రీయబద్ధంగా ఆలోచించి రైతులకు సూచన చేయాలని, ఎరువులు విత్తనాలు ఉచితంగా రైతులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ ఉపాధ్యక్షులు పిండి వెంకట్రావు రామారావు సహాయ కార్యదర్శి సోమనాదం రామనాయుడు కమిటీ సభ్యులు లక్ష్మణ్ ఢిల్లీ రావు వైకుంఠరావు సూరిలు పాల్గొన్నారు.

గోమాతను సంరక్షించాలని కలిశెట్టి పిలుపు

2024 సంవత్సరం పంచాంగం క్యాలెండర్‌ను కలిశెట్టి దంపతులు ఆవిష్కరణ

విశాలాంధ్ర-రణస్థలం : మండలం కోష్ట జంక్షన్‌లో గల ఎస్ కే సీఎం కృష్ణ చైతన్య మందిరం ట్రస్ట్ ముద్రించిన 2024 పంచాంగం క్యాలెండర్ ను ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్, ఎచ్చెర్ల నియోజవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు ఆవిష్కరించారు. శనివారం ఉదయం శని త్రయోదశి పర్వదినం సందర్భంగా ఎస్‌కేసిఎం కృష్ణ చైతన్య మందిరంనకు అనుబంధంగా ఉన్న గోసేవా ఆశ్రమంలో నిర్వహించిన గోమాత పూజలలో కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మందిరం ట్రస్ట్ ముద్రించిన 2024 సంవత్సరం పంచాంగం క్యాలెండర్‌ను అప్పలనాయుడు దంపతులు ఆవిష్కరించారు. ఇదే కృష్ణ చైతన్య మందిరంలో ఈనెల 19న మధ్యాహ్నం మూడున్నర గంటలకు నిర్వహించనున్న జగన్నాథ స్వామి రథయాత్రలో భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అప్పలనాయుడు కోరారు. ముక్కోటి దేవతలు నివాసం ఉండే గోమాతను సంరక్షించుకోవడం ద్వారా మానవాళికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అప్పలనాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధి హక్కులకై ఉద్యమించాలి

పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు

విశాలాంధ్ర-టెక్కలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం ఉద్యమించాలని పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు యు. గనిరాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పిడిఎస్‌యు జిల్లా 12వ మహాసభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం-2020 విద్యా రంగాన్ని కార్పొరేటి కరణ చేయడంతో పాటు రాష్ట్రాల ఫెడరల్ హక్కులను కాలరాస్తుందని అన్నారు. ప్రత్యేక హెూదా, విభజన హామీల ఊసే లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, బొగ్గు గనులు అమ్మేస్తున్నారని, ఆంధ్ర రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కును సైతం తెగ నమ్ముతున్నారన్నారు. 32 మంది బలిదానాలతో, 67 మంది ప్రజా ప్రతినిధుల రాజీనామాలతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెయ్యి రోజులకు పైగా ఆందోళన చేస్తున్న విశాఖ ఉక్కు కార్మికులకు పిడిఎస్‌యు అండగా నిలుస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం, టీడీపీ, జనసేన పార్టీలు ఎటువైపో తేల్చుకోవాలని అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా కేజీ నుండి పీజీ వరకూ విద్యా వ్యవస్థ సంక్షోభంలో కూరుకుందని అన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలు కారణంగా పాఠశాలలను విలీనం చేయడంతో పాటు, టీచర్ పోస్టులను రద్దు చేస్తున్నారని అన్నారు. ఎస్ సి, ఎస్ టి, బి సి, మైనార్టీ విద్యార్థుల పీజీ విద్యకు ఫీజు రియంబర్స్ మెంట్ ను దూరం చేసే 77జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిస్కారం కోసం పోరాడాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి వై.సూర్య ప్రకాశం మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించు కుని సమాజ మార్పులో భాగస్వామ్యం కావాలని అన్నారు. తొలగించిన డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, మొఘలుల చరిత్ర, పీరియాడిక్ టేబుల్, భగత్ సింగ్ చరిత్రలకు సంబంధించిన పాఠ్యంశాలను పునరుద్దరించాలని అన్నారు. డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. ధర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్ సూచించిన విధంగా కేంద్ర బడ్జెట్ లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం, జీడీపీలో 6 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. వినోద్ కుమార్ అధ్యక్షత వహించగా టీచర్ శ్రీను, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల. మాధవరావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, సునీల్ మహేష్ జీవన్ రాజేష్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి..!

ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి : గత నాలుగున్నర ఏళ్ల వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి నెట్టేసారని ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాలం అశోక్ విమర్శించారు.ఈ మేరకు శనివారం మండలంలో బి.జీ పుట్టుగ పంచాయితీ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గేరంటీ కార్యక్రమం ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి అందజేస్తూ, పథకాల ప్రయోజనాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం తుంగాన పుట్టుగ గ్రామంలో పాల్గొని పార్టీ సీనియర్ నేత దివంగత తుంగాన అప్పారావుకు స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం చంద్రబాబు పాలన తిరిగి రావాలని మీ అందరికీ మద్దతుతో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పి కృష్ణారావు సంతోష్ పట్నాయక్, బాసుదేవ రౌలో, మణిచంద్ర ప్రకాష్, బార్ల చిన్నబాబు, రంగరౌలో, బెందాలం తిరుమల రావు, శమళ్ళ సర్వేశ్వరరావు, పూడి రామారావు, కోర్రాయి లక్ష్మి, రేయ్యి భాగ్యశ్రీ, బద్రి కాళీ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన నాంది ఫౌండేషన్ శిక్షణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గత వారం రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో నాంది ఫౌండేషన్ నిర్వహించిన ఉపాధి నైపుణ్య శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ శిక్షణలో భాగంగా నాంది ఫౌండేషన్ శిక్షకులు ప్రస్తుత రోజులలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే కమ్యూనికేషన్ స్కిల్స్,సాఫ్ట్ స్కిల్స్, బృంద చర్చ పైన అవగాహనలను, పవర్ పాయింట్ ప్రెసెంటేషన్, ఇంటర్వ్యూ కు సంబందించిన మెళుకువలను నేర్పించి వాటి పైన విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె శివ శంకర్, డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు ఉపయోగ పడే ఇలాంటి శిక్షణ కార్యక్రమం మన శ్రీకాకుళం జిల్లాలో మన కాలేజీలో నిర్వహించడం ఆనందాయ కమన్నారు. నాంది ఫౌండేషన్ శిక్షకులుఇచ్చిన శిక్షణను విద్యార్థినిలు ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నామన్నారు. అనంతరం నాంది ఫౌండేషన్ శిక్షకులను సన్మానించారు, కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ జోనల్ హెడ్ శ్రీ లక్ష్మి, నాంది శిక్షకులు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేసుమెంట్ అధికారి ఎల్. ప్రసాద్ రావు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ సమతుల్యానికే గడప గడపకు మన ప్రభుత్వం : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-బూర్జ: ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహనరెడ్డి ఆలోచనలు ప్రజాసంక్షేమ విస్తరణలో సమతుల్యం కోసమే అని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం బూర్జ మండలం కాకాన్యం మరియు పెద్ద లంకం గ్రామలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహనరెడ్డి ఎంతో దృఢసంకల్పంతో రాష్ట్రాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందిందన్నారు. రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల సంక్షేమ ఫలాలు ఏస్థాయిలో ఏ వర్గాలకు అందుతున్నాయో, ఏమాత్రం అందుతున్నయో అన్న అంశంపై స్పీకర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలైన నవరత్నాలు తదితర అంశాలు ప్రజాదరణ పొందుతూ ప్రజల్లో జగన్‌పై నమ్మకం పెంపొందేలా చేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం నాడు నేడు కార్యక్రమంతోపాటు అనేక రకాలైన హామీలను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జడ్పిటిసి బేజ్జీ పురుపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమ నాయుడు, డి సి ఎం ఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణ మూర్తి, సర్పంచుల సంఘ అధ్యక్షులు సురపు ఉదయ్, స్థానిక సర్పంచులు కోబాగన రామకృష్ణ, కాగితాపల్లి గోవిందరావు, సీర రంగారావు, వైస్ సర్పంచ్ సాంబమూర్తి, స్థానిక నాయకులు బొత్స లక్ష్మణరావు, సాకెటి శ్రీనివాసరావు, కాగితాపల్లి జగన్ తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక రైలు వెంటనే ప్రారంభించాలి : ఎంపీ

- వాల్తేర్ డివిజన్ డీఆర్ఎంతో ప్రత్యేక భేటీ, వివిధ ప్రతిపాదనల ప్రస్తావన

విశాలాంధ్ర-శ్రీకాకుళం: శనివారం రైల్వే వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తో ప్రత్యేకంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు శనివారం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులు ఏటా అత్యంత నియమ, నిష్టలతో అయ్యప్ప దీక్షలు చేపడతారని ఎంపీ గుర్తు చేశారు. డిమాండ్ కు సరిపడా రైళ్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 15 నుంచి మకర సంక్రాంతి వరకు శబరిమలైకు ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే ఉన్నతాధికారులను కోరారు. శబరిమల ప్రత్యేక రైలు ప్రారంభించాల్సిన ఆవశ్యకతను వివరించారు. దీని వల్ల వేలాది మంది భక్తులు తమ ఇరుమిడిని పవిత్రంగా స్వామివారికి చేర్చే అవకాశం ఉంటుందని, వ్యయ ప్రయాసలు తగ్గు ముఖం పడతాయన్నారు. అలాగే.. ఇటీవల ప్రకటించిన విశాఖపట్నం-వారణాసి ప్రత్యేక రైలును త్వరగా ప్రారంభించాలని, కాశీ అన్నపూర్ణ ఎక్స్ ప్రెస్ గా నామకరణం చేయాలని విన్నవించారు. విశాఖ-పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న మెమూ (07470/07471) రైలును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. భువనేశ్వర్-పలాస మెమూ రైలు (08443-08444)ను శ్రీకాకుళం వరకు నడపాలన్నారు. రోజూ వందలాది మంది ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారని, వారికి ఈ రైలు ఎంతో ప్రయోజనకరం ఉంటుందని తెలిపారు. అలాగే విశాఖ-రాయపూర్ పాసింజర్ రైలును గతంలో తరహాలో వేకువజాము 4.30 గంటలకే నడిచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ లో వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు స్టాపేజీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపాదనలను పరిశీలించిన డీఆర్ఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

చేపపిల్లల పంపకంతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి

వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

విశాలాంధ్ర-కొత్తూరు : చెరువుల్లో చేపపిల్లలు పెంపకంతో గిరిజనుల ఆర్థికాభివృద్ధి జరుగుతుందని కొత్తూరు వైస్ ఎంపిపి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసి వరప్రసాధరావు అనారు. శనివారం మండలం కంట్టమానుగూడ గిరిజన గ్రామంలో చెరువులో చేప పిల్లలు పెంపకంను ఆయన ప్రారంభించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గిరిజనులను అన్నివిధాలగా అభివృద్ధి.చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి, వైసీపీ నాయుకులు కోయెలాపు. సంజీవరావు, వడం శ్రీను వాసరావు టి.గోపి సవర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి అధికారుల ఆకస్మిక దాడులు

1350 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-మందస : మందస బజారువీధిలో శుక్రవారం రాత్రి సివిల్ సప్లయి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 1350 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మందస గ్రామం బజారువీధికి చెందిన వ్యాపారి బి.మోహనరావుకు చెందిన గోదాముపై సివిల్ సప్లయి అధికారులకు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయి డిఎస్‌వి వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 50కేజీల బరువు గల 27 రేషన్ బియ్యం ప్యాకేట్లును స్వాధీనం చేసుకొని పలాస గోదాముకు తరలించారమని, ఈ సంఘటనపై దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు అధికారు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో సివిల్ సప్లయి డి.టిలు గోపాలరావు, రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఇజ్జువరం, కోటపాడులో బాబు ష్యూరిటి కార్యక్రమం

విశాలాంధ్ర-సంతబొమ్మాలి : ఈ మండలం ఇజ్జువరం, కోటపాడు పంచాయతీలలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ నాయకులు వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

15న జిల్లా పెన్షనర్ల సంఘం అత్యవసర సమావేశం

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (న్యూ)జిల్లా శాఖ అత్యవసర సమావేశం ఈ నెల 15న ఉదయం 10గంటలకు శ్రీకాకుళం ఎన్.జి.వో హెూంలో జరుగుతుంది. ఈ విషయాన్ని జిల్లా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రామచంద్రరావు, అంకం ధర్మారావు తెలిపారు. పెన్షన్ దారులంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పెన్షనుదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చిస్తామని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని మామిడి శ్రీకాంత్ పరామర్శ

విశాలాంధ్ర-పాతపట్నం : హరిజన వీధిలో నివాసం ఉంటున్న బెనియా సత్యనారాయణ ఇంట్లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని తూర్పు కాపు కొర్పరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పరామర్శించారు, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు స్వయంగా అగ్నికి ఆహుతి అయిన ఇంటిని పరిశీలించారు. మీ కుటుంబ సభ్యులను అన్నిరకాలుగా ఆదుకుంటామని ధైర్యం చెప్పి వెంటనే తాసిల్దార్‌కు ఫోన్‌చేసి ప్రభుత్వం తరుపున ఎంతమేరకు సహాయం అందించ గలమో ఆయనకి అన్ని రకాలుగా ఆదుకోవాలని తెలిపారు అలాగే కలెక్టర్‌తో కూడా మాట్లాడతా నని మీకు అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు, అనంతరం ఆ కుటుంబ సభ్యులకు బియ్యం పేకట్, నిత్యావసర సరుకులను అందించారు. అయన వెంట నారాయణ రెడ్డి, కే మన్మధరావు తిరుపతిరావు నాగరాజు, శ్రీరామ్ గోపాల్, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉద్దానం సమస్యలపై సమరశీల పోరాటం సాగాలి

సిపిఐ (యం.యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : పోరాటాల పురిటి గడ్డ ఉద్దానంలో ఎన్నో సమస్యలు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగానే మిగిలిపోయాయని, వీటి సాధన కోసం ఉద్దానం ప్రజలు ఉమ్మడిగా సమరశీల పోరాటాన్ని సాగాంచాల్సిన కర్తవ్యం మిగిలే ఉందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. శనివారం పూండీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు ఎందరు మారుతున్నా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని విమర్శించారు. పాలనాధికారం ఒక పార్టీ చేతి నుంచి ఇంకో పార్టీకి మారడమే తప్ప గ్రామాల్లో మౌలిక సమస్యల పరిష్కారం మాత్రం లభించడంలేదని అన్నారు. ఈ నెల 22వ తేదీన ఉద్దానం మర్రిపాడు గణపతి నగర్ లో అమరవీరుల 45వ స్మారకసభను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమం ను విజయవంతం చేయాలని కోరారు.భారత విప్లవోద్యమ వేగుచుక్కలుగా నిలిచిన మూడు వందల అరవైకిపైగా శ్రీకాకుళ అమరవీరులందరినీ ఈ సందర్భంగా విప్లవ నివాళులతో స్మరించుకుంటూ వర్తమాన కర్తవ్యాన్ని ప్రతినబూనుదామని తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలకులు అత్యంత పాశవిక పాలన సాగిస్తూ దోపిడీ శక్తులకు ఊడిగం చేస్తున్నారనీ లక్షలకోట్ల అప్పలతో ఈ దేశాన్ని , దేశ సంపదను కార్పోరేట్ దోపిడీ దొంగలకు అమ్మేస్తున్నారని విమర్శించారు. కేంద్ర పాలకులు తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలకు ఈ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం వంతపాడుతున్నాయనీ ప్రజల ఆకాంక్షలూ ప్రజలువారు ఎదుర్కొంటున్న సమస్యలూ ఈ దోపిడీ పాలకులకు పట్టవన్నారు. కార్పొరేట్ దోపిడీ మూకకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ఈ పాలక పార్టీలు వ్యవహరిస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పంటలకు మద్దతు ధరను ప్రకటించి, చట్టబద్ధతను కల్పించాలన్న డిమాండ్ ను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.శ్రీకాకుళం జిల్లాలో పెండింగ్ లో ఉన్న నీటి ప్రాజెక్టులను ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా ఈ రాష్ట్ర పాలకులు చెప్పలేని దుస్థితిలో ఉన్నారనీ సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి, ఆ భూములను పేదలకు, రైతులకు పంపిణీ చేయాలన్న డిమాండ్ పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా ఉందన్నారు. వీర యోధులెందరో పోరాడిన ఉద్దానంలో ప్రస్తుతం కిడ్నీ వ్యాధి తన విశ్వ రూపాన్ని చూపి ప్రజల ఆయువును హరిస్తుంటే... పాలకులు తాయలాలతో చిట్కాలను ప్రయోగిస్తూ శాశ్వత పరిష్కారం చూపించలేక విఫలత చెందారని విమర్శించారు. ఉద్దానం ప్రజల ప్రధాన జీవనాధారమైన జీడి పంటకు ఈ పాలకులు గిట్టుబాటు ధరను కల్పించలేక చేతులెత్తేశారనీ జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను తెరవాలనే ఇక్కడి ప్రజల డిమాండ్ ను పాలకులు పట్టించుకునే స్థితిలో లేరనీ అన్నారు. ఉద్దానానికి ఆనించి ఉన్న రామకృష్ణాపురం భూ బాధితుల గోడు ఈ పాలకులకు పట్టదని,అక్కడ వంద ఎకరాల భూమిని రాజకీయ అండతో కబ్జా చేసిన వైనాన్ని ప్రశ్నిస్తూ బాధిత జనం పోరాటం చేసినా అధికార యంత్రాంగం స్పందించకుండా ప్రేక్షకపాత్రను పోషిస్తోందని విమర్శించారు. ఇంకా అనేక సమస్యలతో ఉద్యమాల ఉద్దానం పోరుబాట పట్టినా పాలకుల్లో చలనం లేదు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానానికి ఆనించి వున్న వందలాది ఆదివాసీ గ్రామాల్లో 1/70 చట్టం అమలుకాని దుస్థితి వల్ల గిరజనేతులు అక్కడి భూములపై అధికారాన్ని, ఆధిపత్యాన్ని కైవసం చేసుకున్నారు. ఈ గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలన్న ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ పాలకుల కార్యాలయాల్లో ఆమోదం కోసం ఏళ్ల తరబడి పడివుండటం ఈ పాలకుల ప్రజావ్యతిరేక నైజానికి నిదర్శనం. ప్రజలు సంఘటితపడి సమరశీల పోరాటాలను నిర్మించడం ద్వారానే ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం పొందడం వీలుపడుతుందని తాండ్ర అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె యం యస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పీ వో డబ్ల్యూ జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, రైతుకూలీ సంఘం నాయకులు రాపాక మాధవరావు, పీ వై యల్ జిల్లా నాయకులు సార జగన్, ఐ ఎఫ్ టీ యు జిల్లా నాయకులు బర్ల గోపి, అరుణోదయ నాయకులు కుత్తుం ఢిల్లీరావు, న్యూ డెమోక్రసీ పార్టీ కార్యకర్తలు జె.అప్పన్న, గర్ధం కామేశ్వరరావు,పోతనపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలుదారుడు నష్టపోకూడదు

విశాలాంధ్ర-పలాస : కొనుగోలుదారుడు నష్టపోకూడదనే భావనతోనే ఆశ్రా పనిచేస్తుందని జిల్లా జాయింట్ కార్యదర్శి జి ఎం ఎస్ అనిల్ రాజు అన్నారు. ఈనెల 24న న్యూఢిల్లీలో జరగబోయే ఆశ్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఎవర్నెస్)కు సంబంధించిన ఆశ్రా బ్రోచర్ ను శనివారం జిల్లా జాయింట్ సెక్రెటరీ జి ఎం ఎస్ అనిల్ రాజ్ స్థానిక పాత్రికేయులతో కలిసి ఎండిఓ ఆఫీస్ నందు ఆవిష్కరించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువు కొనియోగదారుడు వినియోగదారుడునని, నాసి రకం వస్తువులు, అధిక బిల్లులు ఇచ్చే వ్యాపార సంస్థలపై వినియోగదారుడు కోర్టును ఆశ్రయించవచ్చని అన్నారు. అంతే కాకుండా తమ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా కేసులు వేసి విజయం సాధించిందని అన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ తమ ప్రాంతానికి అనిల్ రాజు మంచి పేరు తేవాలని మరింత ఉన్న శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహారాణా, రాము, అశోక్, నాని, నారాయణరావు, భాస్కరరావు, జయంత్ మాస్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా 'గురుగుబెల్లి'

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లా లైవ్ స్టాక్ డెవలప్మెంట్ అసోసియేషన్(డిఎల్‌డిఏ) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గురుగుబెల్లి నాయుడు అప్పలనాయుడును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. శాసనసభ పది తమ్మినేని సీతారాం అప్పలనాయుడు పేరును ప్రతిపాదించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నామినేట్ చేస్తున్నట్లు ఉత్తర్వులు పశుసంవర్ధక శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. మండలం లోని కొత్తవలస గ్రామానికి చెందిన అప్పలనాయుడు గ్రామ ఉప సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. జిల్లా లైవ్ స్టాక్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్‌గా-కొత్తవలస ఉప సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడుని నామినేట్ చేస్తూ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాలు మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చేపలు పట్టడం... అమ్మడం గౌరవప్రదం : మంత్రి సీదిరి

విశాలాంధ్ర -హిరమండలం: చేపలు పట్టడం, చేపలు అమ్మడం ఒక మంచి గౌరవపదం అని రాష్ట్ర మత్స్య శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం హిర మండలం వంశధార రిజర్వాయర్ నందు మొట్ట మొదటి సారిగా స్వదేశ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో చేపల పెంపకం చేపడుతున్న మత్స్యకారులకు 40శాతం రాయితీపై (4.856 లక్షలు) ఫింగర్లింగ్స్ 80-100 సైజ్ చేపపిల్లలను రాష్ట్ర మత్స్య శాఖామంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యురాలురెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి లు మాట్లాడుతూ వంశధార జలాశయం ద్వారా జిల్లా సస్యశ్యామలం అయ్యిందని రిజర్వాయర్ ద్వారా త్రాగు నీరు, రైతులకు సాగునీరుఅందిస్తూ ఇప్పుడు రిజర్వాయర్ లో చేపలు పెంపకం ద్వారా 786 కుటుంబాలు ఆధార్పడి జీవిస్తునాయని, రానున్న రోజుల్లో వంశధార రిజర్వాయర్ ఒక పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చెందు తుందని అన్నారు. దివంగత మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి రిజర్వాయర్ కు శంఖస్తాపన చేశారని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజన్న బాటలోనే నడిచి రాష్ట్రాన్ని అన్ని వర్గాల వారి నుంచి మన్ననలు పొందుతున్నారని ఇలాంటి ముఖ్యమంత్రి ని మన రాష్ట్ర ప్రజలు మళ్ళీ మళ్ళీ సీఎం ను చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చేపలు తినడం ద్వారా ప్రజలు ఆరోగ్యం గా ఎక్కువ కాలం జీవిస్తారని చేపలు పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. వంశధార నిర్వాశితుల త్యాగ ఫలమే వంశధార రిజర్వాయర్నిర్మాణం అని ఎమ్మెల్యేరెడ్డి శాంతి అన్నారు. నిర్వాసితులకు ఎంత ఇచ్చిన వారు ఋణం తీర్చ లేనిదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఈ డోల తిరుమల రావు, తహసీల్దార్ బి మురళి మోహన్, వైస్సార్సీపీ మండలాధ్యక్షులు మీసాల రామకృష్ణా, ఎవి సురేష్, బూర్లే శ్రీనివాస్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్సార్సీపీ కార్యకర్తలు, మత్స్య కారులు, వంశధార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీకి ఆపస్ సంఘం వినతి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : విద్యా విధానంలో ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలంటూ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావును ఆపస్ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. పిఆర్సికి ప్రత్యామ్నాయంగా జిపిఎస్ అమలుచేయాలని, నూతన విద్యా విధానంలో ఉపాధ్యాయుల విధి విధానాలు సరి చేయాలని వినతి పత్రంలో కోరినట్లు ఆపస్ సంఘం నాయకులు ఆనందరావు, చలపాక రమణ తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయ పింఛను దారులకు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్, జిపిజిఎల్ఐ, సంపాదిత సెలవులు, ఇతర ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరినట్లు వారు తెలిపారు. వారితో పాటు కర్రి వేణుగోపాలరావు, సిగిలిపల్లి ఠాగూర్ పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి పెద్ద పీట : ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : ప్రతి పల్లెలోను, పట్టణంలోను ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజావైద్యానికి పెద్దపీట వేస్తుందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. సోంపేట పట్టణంలో శివారున గల మొగలి కొత్తూరు కాలనీలో శనివారం జెమ్స్ ఆసుపత్రి సారథ్యంలో మొగలికొత్తూరులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సోంపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ నగిరి ప్రభావతితో కలిసి ఎంపీపీ డాక్టర్ దాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే ఈ సమాజం ఆరోగ్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ దూరదృష్టితో ఆలోచిస్తూ అనారోగ్యం పేదలకు శాపం కాకూడదని జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టి ఊరూరా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. అనంతరం ఎంపీపీ డాక్టర్ దాసు ప్రత్యక్షంగా అనేక మంది రోగులను పరిశీలించి ఉచితంగా మందులను జెమ్స్ ఆసుపత్రి ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ విద్యకు దిక్సూచి మౌలానా

- గాంధీ మందిరంలో ఘనంగా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : భారతీయ విద్యా సాంకేతిక అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి విద్యాశాఖామంత్రిగా ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, సెట్ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు పేర్కొన్నారు. నగరంలోని శాంతి నగర్ కాలనీలో గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ 135వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విగ్రహదాత మహిబుల్లాఖాన్ తో పాటు అతిథులు, నిర్వాహకులు మౌలానా విగ్రయానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ బాటలో మౌలానా నడిచార న్నారు. స్వాతంత్ర్యం అనంతరం విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని యువతలో పెంపొందించేందుకు ప్రత్యేక యూనివర్శిటీలు ఏర్పాటు చేయడంతోపాటు ఐఐటీలను నెలకొల్పిన ఘనత మౌలానాకే దక్కు తుందన్నారు. విద్యతోనే ప్రతికుటుంబంలో వెలుగులు నిండుతాయని పూర్తిగా విశ్వసించారన్నారు. ఈ సందర్భంగా అవధాన పండితులు పైడి హరనాథరావు మౌలానా కీర్తిని పద్యం రూపంలో వినిపించారు. ఈకార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు, నిర్వాహకులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, నిక్కు అప్పన్న, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, బాడాన దేవభూషణ్, గుత్తు చిన్నారావు, సయ్యదఫీ, తర్లాడ అప్పలనాయుడు, మాజీ సైనికుల సంఘం ప్రతినిధి పద్మావతి, ఐ.మోహనరావు, ఎన్వోకే ప్రతినిధి సత్యనారాయణ తదితరులున్నారు.

దోమపోటుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : వరిసాగుకు దోమపోటు వచ్చి మండలంలో చాలా గ్రామాల్లో వరిపంట 50శాతం పాడైందని, దోమపోటుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అదుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. మండలంలో చీపుర్లపాడు, కన్నేవలస, మూలపేట, లఖందిడ్డి, బంజీరుపేట, సౌడాం, తిలారు, కొత్తపల్లి, కురుడు, ఊడికలపాడు, జీయన్న పేట, తుంభయ్యపేట, హరిశ్చంద్రపురం, పొడుగుపాడు, కస్తూరిపాడు, పెద్దబమ్మిడి, చిన్న బమ్మిడి, నిమ్మాడ తదితర గ్రామాలలో వరి సాగుకు దోమపటు వచ్చి పొలాంలో 50శాతం పంట పూర్తిగా నాశనం అయిందని, ఎన్ని మందులు కొట్టిన ఫలితం లేదని, దోమపోటుతో రైతులు తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం, వ్యవసాయాధి కారులు స్పందించి రైతులకు పంటనష్టం, పంటకు ఇన్సురెన్సు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న కోటబొమ్మాళి పీఎస్ సినీ బృందం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళిలో గల కొత్తమ్మతల్లిని కొత్తగా నిర్మాణం చేపడుతున్న కోటబొమ్మాల్ సీఎస్ సినీ బృందం శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ బృందంలో హీరో రాహుల్ విజయ్, హీరోయిన్ శివాని, నటులు తేజోమాళిని, వాణి, శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పొట్టాడ గ్రామానికి చెందిన జామి శ్రీనివాస్, నిర్మాత రత్నాజీ, సహ నిర్మాత బాలులు ఉన్నారు. వీరిని ఆలయ పురోహితులు సుసరావు జనార్ధనశర్మ పూర్ణకుంభంతో, స్థానిక దేశం పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, ఆలయ కమిటీ సభ్యులు బోయిన మాధవి క్రిష్ణారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాక్రిష్టలు స్వాగతం పలికారు. వీరికి ఆలయ పురోహితులు జనార్ధనశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సినిమాలో రెండో పాటను అలయ ప్రాంగణంలో హిరో అవిష్కరించగా హీరో హిరోయిన్లులను బోయిన రమేష్ శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోయిన సత్యశ్రీనివాస్, బోయిన రుత్విక్, తంగుడు సునీల్, కోరాడ గోవిందరావు, కసర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటం... సరఫరా నామమాత్రం

- మండల కేంద్రాలకే కందిపప్పు పరిమితం
- పౌరసరఫరాల తీరుపై సర్వత్రా అసంతృప్తి

విశాలాంధ్ర-సోంపేట : నవంబర్ నెల నుంచి రేషన్‌కార్డుదారులకు కందిపప్పు మార్కెట్ ధర కన్నా సగానికే సరఫరా చేస్తామని పౌరసరఫరాల శాఖ చేస్తున్న ప్రచార ఆర్భాటం అంతా ఇంతా కాదు. నెల రోజుల నుంచి పేదలకు కందిపప్పు సరఫరా చేస్తామంటూ ప్రచార మాధ్యమాల ద్వారా ఊదరగొట్టిన విషయం అందరికీ తెల్సిందే. తీరా సరఫరా సమయానికి పౌర సరఫరాల శాఖ చేతులు ఎత్తేసింది. కేవలం మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలకు మాత్రమే రాయితీ ధరపై కందిపప్పు సరఫరా చేస్తూ మైనర్ పంచాయతీలకు మొండి చేయి చూపింది. దీని పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ప్రస్తుతం సోంపేట, కంచిలి మండల కేంద్రాలతో పాటు సోంపేట మండలం బారువ మేజర్ పంచాయతీకి మాత్రమే 20 క్వింటాళ్ల కందిపప్పు సరఫరా చేసి అధికార యంత్రాంగం చేతులు దులుపేసుకుంది. నెల రోజులుగా ప్రచార ఆర్భాటాలు విన్న ప్రజలు గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే వాహనదారులను ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. సోంపేట మండలంలో 23 పంచాయతీలు, కంచిలి మండలంలో సుమారు 30 పంచాయతీలు కలిపి మొత్తం 53 పంచాయతీలకు గాను కేవలం 3 పంచాయతీలకు మాత్రమే కిలో 68 రూపాయలు చొప్పున ఒక్కొక్క రేషన్‌కార్డు దారునికి కిలో కందిపప్పు చొప్పున విక్రయిస్తున్నారు. ఈ రెండు మండలాల్లో సుమారు 50 గ్రామ పంచాయతీలకు కందిపప్పు సరఫరా చేయకపోవడంతో గ్రామాల్లో ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. దీపావళి పండగ సందర్భంలో కూడా కనీసం కందిపప్పు ఇవ్వకపోవడం దురదృష్టకరమని వాపోతున్నారు. కొద్ది మందికి సరఫరాచేసి అధికమందికి మొండి చేయి చూపడం ఎంత వరకు సమంజసమని ప్రజలు నిలదీస్తు న్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట అంటూ ప్రతి చోట ఢంకా బజాయించే అధికారులు, ప్రజా ప్రతినిధులు కందిపప్పు సరఫరా విషయంలో ప్రజలకు ఎందుకు న్యాయం చేయలేకపోతున్నారని గ్రామీణులు నిలదీస్తున్నారు. మరోవైపు పంచదార కూడా సరఫరా చేయకుండా కేవలం మొక్కుబడిగా బియ్యం మాత్రమే అందించి ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని పేద ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కందిపప్పు సరఫరాచేస్తామంటూ నెల రోజులుగా ప్రచారం చేసిన ప్రభుత్వ పెద్దలు ఇది ఎంతవరకు సమంజసమో పునరాలోచించాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

డిసెంబర్ నుంచి గ్రామాలకు సరఫరా : నవంబర్ నెలలో అన్ని గ్రామాలకు కందిపప్పు సరఫరా చేయకపోవడం పట్ల పౌరసరఫరాల శాఖ డెప్యూటీ తహశీల్దార్ కూర్మారావు వద్ద విశాలాంధ్ర ప్రస్తావించగా ఈ నెలలో తక్కువ పరిమాణంలో కందిపప్పు వచ్చినందు వల్ల ముందుగా మేజర్ పంచాయతీలకు అందజేశామని డిసెంబర్ నెలలో గ్రామాలకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో ధనత్రయోదశిని పురష్కరించు కొని శనివారం నాయీబ్రహ్మణలు ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల నాయీబ్రహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రహ్మణ జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అద్వర్యంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పురాణాల ప్రకారం దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనం చేస్తున్నప్పుడు ధనత్రయోదశి రోజున విష్ణువు ధన్వంతరి అవతారంలో అమృత కలశాన్ని పట్టుకుని కనిపించాడని పురాణాలు చెబుతున్నాయని అందుకే అదే రోజున ధన్వంతరి పుట్టినరోజుగా భావిస్తారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏటా ధన్వంతరి జయంతి జరుపుకుంటాంని, తనకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈశాన్య దిశలో ధన్వంతరి విగ్రహం ఉంచి ప్రార్థిస్తే దీర్ఘాయువు లభిస్తుందని చాలామంది నమ్ముతారన్నారు. నాయీ బ్రహ్మణ కులదైవం అయిన ధన్వంతరి శ్రీ మహావిష్ణువు అవతారమని పూర్వకాలంలో గొప్పగొప్ప ఆయుర్వేదిక వైద్యులు ధన్వంతరి అనే బిరుదుతో సత్వరించే వారన్నారు. ఆరోగ్యానికి ఆదిదేవత అయిన ధన్వంతరిని సకాల రోగాల విముక్తికై ఈ ధన్వంతరి పూజా ధ్యానం చేస్తుంటారని నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస లక్ష్మి, తెలగవలస శంకరరావు, విరాస్వామి, శారద, జయలక్ష్మి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలి

ఎమ్మెల్యే అశోక్‌కు వినతిని అందజేసిన ఆపస్

విశాలాంధ్ర-కవిటి: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే అశోక్‌కు ఆపస్ సంఘం తరపున వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే అశోక్ క్యాంప కార్యాలయం రామయ్యపుట్టుగలో ఆపస్ సంఘ సభ్యులు ఇచ్చాపురం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ ను కలసి వినతిపత్రం అందజేశారు. సి.పి.యస్. విధానానికి మరో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జి.పి.ఎస్. విధానం అమలుకు సంబంధించి జి.ఓ.నెం.116, అక్టోబర్ 24, 2023 సంవత్సరం లో విడుదల చేశారని అన్నారు. ఆప్పటి ప్రతిపక్ష నేత ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్ర సమయంలో పాత పెన్షన్ అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు అని అన్నారు. కావున ముఖ్యమంత్రి పునరాలోచన చేసి జె.పి. ఎస్. జీవో 116 ను ఉప సంహకరించుకొని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు 117, 2022 సంవత్సరం మే నెల పదవ తేదీ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఆ ఉత్తర్వుల వలన ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి అసంబద్ధంగా ఉన్నందున ఉపాధ్యాయులకు పెనుభారంగా మారిందని తెలిపారు. కొన్ని ఉన్నత పాఠశాలలకు గ్రేడ్-2 హెచ్.ఎం, పి.డి పోస్టులు కోల్పోయారని ఈ సందర్భంగా తెలియజేశారు. కావున 117 ఉత్తర్వులను రద్దు చేయించి గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు 53,2020 అక్టోబర్ 12 అనుసరించి ఉపాధ్యాయుల క్యాలెండర్ (స్ప్రింగ్స్ సరి చేయించవలసినదిగా కోరారు.ప్రతి ఉన్నత పాఠశాలలకు గ్రేట్-2,హెచ్.ఎం, పి.డి పోస్టులు భర్తీ చేయాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావలసిన ప్రావిడెంట్ ఫండ్, ఎ.పి.జి.ఎల్.ఐ సంబంధిత సెలవులు ఇతర ఆర్థిక బకాయిలను సెప్టెంబర్ 30 లోపు పూర్తిగా చెల్లిస్తామని తెలిపారని, పి.ఆర్.సి, పి.ఏ ప్రతి ఉన్నత పాఠశాలకు గ్రేట్-2,హెచ్.ఎం,పి.డి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావలసిన ప్రావిడెంట్ ఫండ్,ఎ.పి.జి.ఎల్.ఐ సంబదిత సెలవులు ఇతర ఆర్థిక బకాయిలను సెప్టెంబర్ 30 లోగా పూర్తిగా పెంచాలని, పి.ఆర్.సి,పి.ఏ బకాయిలను అక్టోబర్ 31లోపు చెల్లించాలని జాయింట్ స్టాప్ కౌన్సిల్ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇచ్చివున్నారని అయితే ఇంతవరకు చెల్లించలేదని తెలియజేశారు.కావున సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు. వినతి అందజేసిన వారిలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే సోమేశ్వరరావు, కవిటి ఇచ్చాపురం ఆపస్ మండల అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, బి శంకర్రావు,ఆపస్ కార్యదర్శి ఎం తారకేశ్వరరావు, ఆపస్ సంఘ నాయకులు కోల మల్లేశ్వరరావు, ఎల్ ధర్మారావు, చిరంజీవి, నాగేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అల్పసంఖ్యాకుల సంక్షేమ దినం

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ అల్ప సంఖ్యాకుల సంక్షేమ దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధులు, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో రాజ్యాంగబద్ధంగా మూడు రకాలైన మైనారిటీ ప్రజలు వున్నారని, వారికి రాజ్యాంగబద్ధంగా హక్కులు, విధులు కల్పించబడ్డాయని తెలిపారు. అలాగే దేశ సంక్షేమం కోసం దేశాభివృద్ధి కోసం, జాతీయ సమైక్యత కోసం వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వి.సిహెచ్.వేంకటేశ్వరరావు, డా.పి.అన్నాజీరావు, పరమేశ్వరరావు, రెయ్యమ్మ, శ్రీవిద్య, పూజాభరధ్వాజ్, పల్లవి, కృష్ణవేణి, త్రినాధరావు, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపిద్దాం... రాష్ట్రాన్ని కాపాడుకుందాం

- భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమంలో బోయిన గోవిందరాజులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రంలో చంద్రబాబుపాలన రాకపోతే ఈరాష్ట్రంలో సామాన్యులు బతకడం కష్టం అవుతుందని, ఇప్పటికే రాష్ట్రం మరో 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని రాష్ట్ర బిసి సాధికారిత కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. శనివారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ నాయి బ్రహ్మణుల వీదిలో ఇంటింటికి వెళ్ళి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. అలాగే ప్రతిఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానూ చేపట్ట బోయే పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒకొక్కరికి ఏడాదికి రూ. 15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500లు దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుగ్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ. 20వేలు ఆర్థిక సహాయం తదితర సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నౌగాపు నాగరాజ, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, కోరాడ గోవింద, సకాలభక్తుల రాంకుమార్, కోరాడ చిన్న గోవింద, అను తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం హరిశ్చంద్రపురం పంచాయతీలో మాజీ ఎంపీటీసీ హనుమంతు అప్పలరాజు, చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

చిన్నారి ఆరవ్ బిసాయికి ఆర్థిక సాయం

- అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నగదు సేకరణ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన జుజిస్టి బిసాయి,కవిత దంపతుల కుమారుడు అరవ్ బిసాయి హెచ్ ఎల్ హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నడు. బోన్ మెరో ట్రాన్స్ ప్లాంట్ వైద్య చికిత్సకు 20లక్షలు వరకు ఖర్చు అవుతుందని చిల్డ్రన్ ఆసుపత్రి వైద్యులు సూచించారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి తో రోజు వారి కూలితో పూట గడిపే తాము ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసే స్తోమత లేదని నిరుపేద తండ్రి వాపోయాడు. ఇప్పటికే అప్పులతో సతమత మవుతున్న తమకు దాతలు స్పందించి తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని కోరారు.ఈ విషయం తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ బాధితుని తరుపున వివిధ కాలేజ్ లు,స్కూల్ ద్వార కొంత అమౌంట్ కలెక్ట్ చేసుకొని మొత్తం 35వేల,620 రూపాయలు అరవ్ తల్లీ తండ్రికి శనివారం అందజేశారు. సహాయం అందించిన ప్రతీ విద్యార్థులకు, అధ్యపకునికి స్కూల్, కాలేజ్ యాజమాన్యానికి సంస్థ మరియు అరవ్ కుటుంబం తరుపున ధన్యవాదములు తెలియజేశారు.ఈ పేద కుటుంబానికి మిగతా శ్వచ్ఛంద సంస్థలు స్పందించి అండగా నిలబడాలని అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో లలిత, సునీత, సంగీత, హరిప్రియ, రాజేష్, ప్రశాంత్, సాగర్, సురేష్, సంతోష్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత రసాయనాల బాణాసంచా విక్రయాలు

- కోరలు చాస్తున్న కాలుష్యం...
- ధనార్జనే వ్యాపారుల లక్ష్యం
- ఇదేనా స్వచ్ఛ భారత్ స్ఫూర్తి
- మామూళ్లు మత్తులో అధికారులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : బాణాసంచాలో బేరియం సహా నిషేధిత రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన టపాసులను వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. అటువంటి వాటిని విక్రయాలు జరిపించకూడదని పర్యావరణ అధికారుల సూచనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. పర్యావరణ కాలుష్యం, శబ్ద కాలుష్యం నేపథ్యంలో సాధారణ టపాసు లకు బదులు గ్రీన్ క్రాకర్స్‌ను వినియోగించాల్సి ఉంది. స్వచ్ఛభారత్ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా బాణాసంచా విక్రయాలతో వినియోగాలో ఉన్నాయి. కాలుష్యకోరాల్లో వాతావరణాలు చిక్కుకున్నప్పటికీ అధికారులు కన్నులుండి చూడలేని ధృతరాష్ట్ర వైఖరి అవలంబిస్తున్నారు. అందుకు వీరికి అందుతున్న ముడుపులే కారణమని ఆ మత్తులోనే అధికారులు జోగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. షాపు యజ మానులు బిల్లులు చూపిస్తూ వస్తువు పేరు లేకుండానే అందించటం గమనార్హం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని కూడా అందించడం లేదనేది తెలియవచ్చింది. కోట్ల రూపాయలలో వ్యాపారం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తెలుస్తోంది. పాలకుల మౌఖిక ఆదేశాలతో అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని తెలిసింది. ఇటీవల కాలంలో బాణా సంచే తో జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలు ప్రాణాలు కోల్పోయిన వారు, అంగవైకల్యంతో బ్రతుకు జీవుడా అంటూ రోధిస్తున్న వారు కళ్ళ ముందు కనిపించిన సత్యాలు తెలుసు కోవలసిన అవసరం ఉంది.

- సుప్రీం ఆదేశాలు పట్టవా... బేరియం సహా ఇతర నిషేధిత రసాయనాలతో కూడిన బాణాసంచా నిషేధం అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని భారత సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభు త్వంలోని అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికీ కనీసం పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. బాణాసంచాలో నిషేధిత రసాయనాలు వినియోగించ రాదని 2021లో సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను అనుసరించి గ్రీన్ క్రాకర్స్ కు అనుమతులు ఉన్నట్లు తెలిపింది. వాటిని కూడా దీపావళి వంటి పండగ పర్వదినాల నాడే వినియోగించాలని స్పష్టం చేసింది. నిషేధిత రసాయనాలతో నిర్దిష్ట ప్రాంతంలో తయారుచేయడం, విక్రయించడం ఉప యోగస్తున్నట్లు తేలితే సంబంధిత ప్రాంతం లోని అధికారులను బాధ్యులను చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎప్పటికైనా ప్రభుత్వ నిబంధనలను పాటించి టపాసుల విక్రయాలపై నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవల సిన బాధ్యతతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించ వలసిన ఆవశ్యకత అధికారులపై ఉంది.

మంత్రి సీదిరిని కలిసిన వైస్సార్సీపీ శ్రీకాకుళం జిల్లా కోశాధికారి లోతుగెడ్డ

విశాలాంధ్ర-హిరమండలం : హిరమండలం వంశధార రిజర్వాయర్‌ను సందర్శించి రిజర్వాయర్‌లో శనివారం చేప పిల్లల్ని విడిచి పెట్టడానికి వచ్చిన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజుని స్కాట్ పేట వద్ద శ్రీకాకుళం జిల్లా వైస్సార్సీపీ కోశాధికారి, పాతపట్నం సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాద్‌రావు, పాతపట్నం జడ్పీటీసీ లింగాల ఉషారాణి మంత్రిని స్వాగతం పలుకుతూ పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి. అప్పలరాజు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు పలికారు. ఈ కార్యక్రమంలో కోయిలాపు సంజీవరావు, పాతపట్నం ఎంపీటీసీ యరకయ్య, పాతపట్నం సర్పంచ్ సిర్ల జోగారావు, గేదల ఉమా మహేశ్వరావు, కొత్తూరు ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్, సర్పంచ్‌లు కోయిలాపు శ్రీనివాసరావు, టంకాల రమణ రావు, బిల్లింగి సంజీవరావు,పెద్దింటి కృష్ణమూర్తి, పుచ్చ అప్పారావు, సవర ఫల్గుణరావు, అగతముడి రంజిత్ కుమార్, వలురౌతు ఆఫీస్‌రావు, గుజ్జ రామారావు, సనపల కోటి, మెండ సుదర్శన రావు, సరస్వతి ఫౌండేషన్ చైర్మన్ పాట్నూరు మధు, స్కూల్ కమిటీ చైర్మన్ వడమ శ్రీను, వైస్సార్సీపీ నాయకులు, సిర్ల ప్రభాకర్, చిరంజీవులు, రాము పల్ల రామకృష్ణ, టోంపల గోపి తదితరులు పాల్గొన్నారు.

ధనుకువాడలో సోమవారం ఉచిత మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : మండలంలోని ధనుకువాడ గ్రామంలో నిహారిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పటల్ డాక్టర్లుచే సోమవారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వ హించటం జరుగుతుందని నిహారిక సేవా సంస్థ అధ్యక్షుడు మెండ నర్సింహమూర్తి తెలిపారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక ఎన్జీవోహోం లో జిల్లా అధ్యక్షులు పిట్టా. చంద్రపతి రావు అధ్యక్షతన సంఘం నాయకులు సభ్యులు అందరూ కలసి తీర్మాణాలు చేసి ఆమోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 తేదిన రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగలరావు యాదవ్ రాష్ట్ర కార్యవర్గం సభ్యులు తో కలసి కంపోస్ట్ కాలని లో గల యాదవ సామాజిక భవనం లో జరిగే సమావేశానికి హాజరవుతారని, డిసెంబర్ 07 తేదీన జరగబోయే బీసీ రాదయాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదల చేయడం జరుగుతుందని, అనంతరం పత్రిక మిత్రులతో సమావేశం, మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సంఘ నిర్మాణం, పటిష్ఠత, సంఘ బలోపేతం తో భాగంగా బీసీ హక్కులు కొరకు మరో స్వతంత్ర పోరాటం, అనేకమైన పెండింగ్ లో వున్న బీసీ అంశాలు కొరకు 07.12.23. తేదీన శ్రీకాకుళం జిల్లా లో జరగబోవు రథ యాత్రకు రాజకీయలకు అతీతంగా జిల్లాలో గల అన్నీ రాజకీయ పార్టీలు నాయకులను, ప్రజా ప్రతినిధులను, 139 బీసీ కులాలు వారందరు, ప్రజా సంఘాల నాయకులు, బీసీ మహిళలు, బీసీ యువకులు, బీసీ విద్యార్థులు, బీసీ వృత్తి ధార కుల సంఘాలు, బీసీ ఉద్యోగులు, బీసీ విశ్రాంతి ఉద్యోగులు మొత్తం బీసీ సమాజంలోగల అన్నీ సంఘాలు, బీసీ/ఓబీసీ లకు అందరూ, వివిధ సంఘాలను కలసి ఈ రథ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దత్తు ఇచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో బడాన దేవభూషణ రావు, బుడుమూరు రాజేష్, కాయితీ వెంకటరమణ, పాలిన ప్రసాద్, గడ్డిబోయన క్రిష్ణ, ఇప్పిలి చిన్నారావు, మూల నారాయణ రావు, పిట్టా భాగ్య చంద్ర, కర్రీ రంగాజీ దేవ్, ఊర్జాపు రవి, కాళ్ల వేంకట రావు, పుల్లరి దూర్యోధన, జి. ధిల్లేసు,గుంటక చంద్ర శేఖర్, రౌతు శంకర్ రావు, ఎ.శ్రీనివాసరావు, తిప్పానగాంధీ, దామోదర కేశవ, ఎల్. నాగరాజు, తీర్లంగి రమేష్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పి.ఆర్.టి.యు మండల శాఖ సమావేశాన్ని నిర్వహించుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షునిగా సుకాంత్ లిమ్మాయ్, గౌరవ అధ్యక్షునిగా రాజగోపాలం, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌లతో పాటు ఉపాధ్యక్షులుగా సత్యన్నారాయణ, సి.హెచ్ శశిబాల, కార్యదర్శులుగా శ్యామ్‌కుమార్, రాంబాబు, ఇప్పిలి లలితలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.వెంకటరావు, సత్యన్నారాయణ, ప్రకాష్, లోహిదాసు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి నడకే సరైన మార్గం

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఒక్క నయాపైసా ఖర్చు లేని వ్యాయామం నడక మాత్రమేనని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన పవన్ పుత్ర వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ పదవీ విరమణ అనంతరం రెగ్యులర్‌గా వాకింగ్ చేస్తూ 75 ఏళ్లు దాటిన వారిని ఏడుగురిని గుర్తించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనేక రోగాల బారి నుండి ఉపశమనం పొందడానికి వాకింగ్ ఎంతో ఉపకరస్తుందన్నారు. వ్యాయామాల్లో నడక అనేది తెలికిపాటి వ్యాయామం అని, నడక వల్ల బరువు తగ్గడంతో పాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గుండె పనితీరు మెరుగుపడటంతో పాటు గుండె పనితీరు క్రమ బద్ధం చేయడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి మేలు చేకూర్చేతుందని అన్నారు. సన్మాన గ్రహీతలు...సీహెచ్.తాతయ్య, డాక్టర్ డి.సత్యనారాయణ, గేదెల వెంకట అప్పలనాయుడు, అల్లంసెట్టి హరిబాబు, బి. రామారావు, బి జానకిరామ్, వి. నాగభూసన్, పి. రామశివాజీ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి మాజీ గవర్నర్ పీజీ గుప్తా, పవన్ పుత్ర వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొండలరావు, పూజారి మన్మదరావు, గేదెల అప్పలనాయుడు, కురిటి వెంకట అప్పలనాయుడు, డాక్టర్ పాండు రంగారావు, ఐకె రావు, అండవరపు రవి తదతరులు పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి : డిఆర్ఓ గణపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : భారత రత్న, భారతదేశ మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచనలతో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి ఎం గణపతి రావు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశం మందిరంలో భారతదేశ మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 136 వ జయంతి ఉత్సవాల వేడుకల సందర్భంగా అబ్దుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి జిల్లా రెవిన్యూ అధికారి ఎం గణపతి రావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ,జామ్యామసీద్ ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ఎం.గణపతి రావు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవంగా, మరియు మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఇస్లాం యొక్క ప్రధాన తీర్థయాత్ర ఇంద్రమైన మక్కాలో జన్మించారు. అతని తల్లి ధనిక అరేబియా షేక్ కుమార్తె మరియు అతని తండ్రి ఆఫ్ఘాన్ చెందిన బెంగాలీ ముస్లిం, స్వతంత్రంతోపాటు సెక్యులరిజంపై నమ్మిన వ్యక్తి, ఇండియా విన్స్ ఫ్రీడం అనే పుస్తకాన్ని రచించిన గొప్ప మేధావి. 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన వ్యక్తి. దేశానికి స్వతంత్రం వచ్చిన అనంతరం మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సాహిత్యం, రచనలు, మేధో సంపత్తి ద్వారా దేశానికి ఎన్నో సేవలు చేశారని, దేశ ప్రజానీకానికి మార్గదర్శకుడిగా ఉంటూ గొప్ప దార్శనికతతో దేశాన్ని ముందుకు నడిపారన్నారు. భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని, సైన్స్ అండ్ కల్చర్ కి, విద్య అనుబంధ రంగాలకు కూడా మంత్రిగా పని చేశారని, విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వతంత్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ, జామ్యామసీద్ ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ జీవన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వం మైనారిటీకి అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మైనారిటీ వర్గాల పిల్లల చదువులకు మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. సచివాలయం వ్యవస్థ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. జిల్లా వర్క్ బోర్డు ప్రెసిడెంట్ జిరాజుద్దీన్, జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ ఎం.ఎ.బేక్, అబ్బు బకరా ప్రెసిడెంట్ హర్షద్, జిల్లా సెక్రెటరీ అమానుల్లా, జనరల్ సెక్రేటరీ సైలాని, టౌన్ మైనారిటీ ప్రెసిడెంట్ రషీద్, జామ్యామసీద్ ఖాజీ అబ్దుల్ వాహబ్, సుల్తాన్, మన్ను, ఫాస్టర్లు అలజంగి నవీన్ కుమార్, జయరాజ్, డానియల్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ ఫిలిమాన్, వక్ బోర్డు సహాయకులు రియాజ్, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర మైనారిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపిపి ఆరంగి

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రజానీకానికి నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళీధర్ శనివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ హోదాల్లో వున్న ముఖ్య నాయకులకు, అధికారులకు, పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, వ్యవసాయదారులకు దీపావళి శుభాకాంక్షలు తెలియచేశారు.

శ్రీనీలమణి దుర్గా అమ్మవారిని దర్శించుకున్న సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పాతపట్నం : శ్రీనీలమణి దుర్గ అమ్మవారిని ఎత్స్యశాఖ మంత్రి సిదిరి.అప్పలరాజు శనివారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి టి. వాసుదేవరావు మరియు వేద పండితుల వేదమంత్రాలు నడుమ ఆలయ అర్చకులు మంత్రి ని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు లింగాల ఉషారాణి , ఎంపీటీసీ కొండాల ఎరకయ్య, గేదెల ఉమామహేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటవ తేదీన ఫెన్షన్ విధిగా చెల్లించాలి

పెన్షనర్ల సంఘం డిమాండ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రతినెల ఒకటో తేదీన ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్ అందరికీ విధిగా జీతాలు చెల్లించాలని ఆముదాలవలస పెన్షనర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరి గిన సమావేశంలో పలు తీర్మానాలు ఆమో దించారు. బకాయిలు పడ్డ 185 నెలల కరు వు భత్యం, పిఆర్‌సి బకాయిలు కనీసం సంక్రాంతి లోపుగా అందించాలని తీర్మా నించారు. ఈహెచ్ఎస్ సక్రమంగా అమలు చేసి వృద్ధులైన పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధన రావు, హెచ్ వి సత్యనారా యణ, బొడ్డేపల్లి మోహనరావు, కే సంజీవ రావు, దన్నాను శ్రీరామ్ మూర్తి, బెండి గోపి, బివి రమణ, కృష్ణమోహన్, లక్ష్మణరావు బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 25వరకు ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీకాకుళం పార్సిల్ కొరియర్ రవాణా విభాగము ద్వారా డోర్ డెలివరీ మాసోత్సవములు ఈనెల 25 తారీకు వరకు నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీకాకుళం బస్ స్టేషన్ ఆవరణ నుండి శ్రీకాకుళం 1వ మరియు 2వ డిపో మేనేజర్లు మల్లికార్జున రాజు, శర్మ ఆధ్వర్యంలో డోర్ డెలివరీ ర్యాలీ పట్టణములో బయలుదేరి 7 రోడ్ల జంక్షన్ వరకు నిర్వహించబడినది. ఈ ర్యాలీలో రెండు డిపోలలో ఉన్న ఉద్యోగులు, సంఘ నాయకులు సూపర్వైజర్లు, ఆఫీస్ సిబ్బంది, కార్గో ఆఫీస్ సిబ్బంది సుమారు 46 మంది పాల్గొని జయప్రదం చేసినారు, ఇందులో భాగంగా 1వ డిపో మేనేజర్ మాట్లాడుతూ, పది కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన డెలివరీ పార్సిల్ కొరియర్లను మీ ఇంటి వద్దకు తక్కువ చార్జీలతో, సకాలంలో సురక్షితముగా మీ ఇంటి వద్దకు చేర్చబడుతుందని తెలియజేశారు.

రాష్ట్ర భవిష్యత్తు మారాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలి

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్

విశాలాంధ్ర-వేపాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు ప్రజల భవిష్యత్తు మారాలంటే చంద్రబాబు నాయుడు సీఎం అవ్వాల్సిందేనని రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన వేపాడలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల భవిష్యత్ మారాలంటే కేవలం చంద్రబాబు వలనే సాధ్యమవుతుందని తెలియజేశారు. ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి తోడ్పడే విధంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు రూపొందిస్తూ 2024లో ఏ విధంగానైనా తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసే దిశగా మన ప్రయాణం ఇక నుండి ముందుకు సాగించాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు టెలిగ్రామ్ ద్వారా మనటీడీపీ యాప్ లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ ఈ నెల 1వ తేదీ నుండి 45 రోజులు పాటు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచాలని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతీ రోజు ప్రతీ బూత్ కన్వీనర్ ద్వారా 30 మాత్రమే భవిష్యత్తుకు గ్యారెంటీ రిజిస్ట్రేషన్ నమోదు అవుతాయి. కావున వారి యొక్క విధి నిర్వహణను ప్రతీ క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల పరిధిలో ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తే, వాటిని మరల చేర్పించాలని. కొత్త ఓట్లపైన ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), విశాఖ టీడీపీ పార్లమెంటరీ వెలమ సాధికార సమితి కన్వీనర్ లాలం అర్జునరావు, విశాఖ టీడీపీ పార్లమెంటరీ తెలుగుయువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, మండలం పార్టీ ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, జామి అప్పలనాయుడు, చల్లా వెంకటరావు, కోలా అప్పలసత్యం, రావాడ రాము, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, బోజంకి మహేశ్వరరావు, రంధి మహేశ్వరరావు, గోగాడ నాగభూషణం, అచ్చంనాయుడు, నిరుజోగి బంగారునాయుడు, నిరుజోగి దాలినాయుడు, సూరిదేముడు, డెక్కా దేముడునాయుడు, కోన సత్యం, గోకేడ సత్యం, గొర్రిపోటు రాము, బుసరి కృష్ణ, అక్కిరెడ్డి వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

నేడు దీపావళి పండగ

విశాలాంధ్ర-వంగర : ఆదివారం ఎంతో ఘనంగా దీపావళి పండగను అంతటా జరుపుకో నున్నారు.దీపావళి అంటే దీపాల వరుస గా చెప్పుకొంటుంటారు. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలలో ఇది ఒకటిగా చెప్పాలి.దీపావళి ఎంతో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాళికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలుగా చెప్పక తప్పదు. ఈ పండుగ ప్రతియేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్థశి. దీన్ని నరక చతుర్థశిగా జరుపుకుంటారు.

చిన్నారుల వైద్యానికి సహాయం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మంలంలో కేశుపురం గ్రామానికి చెందిన శివంగి కూర్మారావు, భూలక్ష్మి దంపతులకు పుట్టిన కవలలు బోన్‌మ్యారేతో బాధపడుతున్న విషయంపై గ్రామ యువత స్పందించి స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థల సహాయాన్ని అర్థించారు. దాంతో విద్యా సంస్థల్లోని విద్యార్థుల నుండి సేకరించిన 35వేల రూపాయలను పాఠశాల ఛైర్మన్ చాట్ల తులసీదాసు ఆధ్వర్యంలో గ్రామ యువతకు అందజేసారు. పదమూడు నెలల కవలలు హర్షవర్ధన్, హర్షితలకు తగిన వైద్య సహాయాన్ని అందివ్వడానికి స్వర్ణభారతి విద్యా సంస్థల సహకారం గొప్పదని గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గౌరీశంకర్, జూనియర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ జయప్రకాష్, సందీప్, విద్యా సంస్థల కోఆర్డినేటర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

బాలలకు భద్రత కల్పించి వారి హక్కులు కాపాడదాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ వారు బాలలు హక్కుల వారోత్సవాలు -2023 న పురస్కరించుకొని రూపొందించిన గోడ పత్రికను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు చేతులు మీదుగా వారి కార్యాలయంలో ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లతుడుతో రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని వారి హక్కులుకు భంగం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలనీ, బాలల భద్రతకు,వారి రక్షణ ,సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని. సూచించారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బాలలు విద్యా, వైద్యము కోసం అనేక అభివృద్ధి కార్యమాలను చేపడుతుందని, ప్రాధాన్యత ఇచ్చి అధిక నిదులును కేటాయి స్తుందని తెలిపారు.ముఖ్యంగా పాటశాలల్లో నూతన తరగతులు నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీరు, మౌళిక సదుపాయాలు కల్పిం చడం, డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సదుపాయాలు, టాబ్ లు పంపిణీ, నాణ్యమైన సమతుల్య పౌష్టిక ఆహారం పంపిణీ, అమ్మఒడి, విద్యాకనుక, విద్యా దీవెన,నాడు నేడు వంటి మొదలగు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థుల కోసం ప్రవేసపెట్టి వారి బంగారు భవి ష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు.బాలలు హక్కులు పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ అప్పారావు మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 తేదీ వరకు బాలలు హక్కులు వారోత్స వాలు రాష్ట్రమంతటా అందరి సహకారంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్ర మంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.రాజేష్, కార్పొరేటర్లు ధనలక్ష్మి, సత్యనారాయణ,జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇంఛార్జి అధికారి యాళ్ల నాగరాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది అరుణ్ కుమార్,గౌరీ, వై సీ బి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఝాన్సీ రాణి, శ్రీనివాసరావు ,శివ శంకర్ ,పల్గున, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా ధనలక్ష్మి కుంకుమ పూజ

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసి ఉన్న ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మి కుంకుమ పూజ అత్యంత వైభవంగా జరుపుతున్న అర్చకులు శ్రీ కప్పగంతుల శ్రీనివాస శర్మ అత్యధికంగా పాల్గొన్న భక్తులు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ పూడి గాలి నాయుడు, ధర్మకర్తలు హాజరైతిరి. పూజ అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, ధనలక్ష్మి పూజ చేసిన కొత్త నాణెము , ప్రసాదము వితరణ జరిగినది. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో తగు ఏర్పాటు చేశారు.